కథ

# పుట్టింటి చీర

హోతా పద్మినీ దేవి

"అక్కా! బయటికి వెళ్తున్నాను. ఒకసారిలా వచ్చి నాకు ఎదురు రావాలే" ప్రకాశం పిలిచాడు.

"ఏవిట్రా విశేషం?" సావిత్రి నవ్వుతూ బయటకొచ్చింది.

"నేను ఇంటర్వ్యూకి వెళ్తున్నాను"

సావిత్రి చిరునవ్వుతో ఎదురొచ్చిందతనికి.

"థాంక్స్ అక్కా! నాకీ ఉద్యోగం వస్తే నీకు పట్టుచీర కొంటాను"

"సరే" అందామె నవ్వుతూ.

"నేను వేళాకోళంగా అనడం లేదు. ఇది నా వాగ్దానం"

"సరే లేరా! ముందు ఇంటర్వ్యూ బాగా చేసిరా" ప్రకాశం హడావుడిగా వెళ్ళిపోయాడు.

"వాడికీ ఉద్యోగం వస్తే బాగుండును. కాస్త ఆర్థికంగా వెసులుబాటవుతుంది. నీకు మీ అక్కయ్యలకి పెళ్ళిళ్ళు చేసి పంపాక మళ్ళీ, ఒక్క చీరయినా పెట్టలేక పోయాను" రాజారావు స్వరంలో బాధా వేదనలు ప్రతిఫలించాయి.

"పోనీయండి నాన్నా! మీరు మాత్రం ఎక్కడ నుంచి తెస్తారు?" అంది సావిత్రి.

ఆయన వ్యథగా నిట్టూర్చాడు. ప్రయివేట్ కంపెనీలో చిన్న ఉద్యోగిగా పనిచేస్తున్న తనకి సముద్ర కెరటాల్లా ఒకదాని వెనుక మరొకటిగా తరుముకొస్తున్న ఖర్చులు తలకి మించిన భారమయ్యాయి. భార్యకి బ్లడ్ కేన్సర్. ఆమె బ్రతకదని తెలిసీ దొరికిన చోటల్లా అప్పులు చేసి ఆమెని హైదరాబాదు తీసుకెళ్ళాడు. ఆమెకి జబ్బు ముదిరిపోయిందని, తాము చేసే వైద్యం ఏమీ లేదని డాక్టర్లు పెదవి విరిచారు. భార్య దక్కలేదు. అప్పు మిగిలింది. అతి కష్టం మీద ఆ అప్పు తీర్చగలిగాడు. ఈలోగా పెద్ద కూతురు పెళ్ళికి ఎదిగి వచ్చింది. ఎంత క్లుప్తంగా పెళ్ళి చేసినా పెళ్ళి ఖర్చుల కోసం అప్పు చెయ్యక తప్ప లేదు. రెండేసి, సంవత్సరాల తేడాలో మిగతా ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేసాడు. తన కష్టాన్ని అర్థం చేసుకునే అల్లుళ్ళు దొరికారు. అదొక్కటే తను చేసుకున్న అదృష్టం. కూతుళ్ళ పెళ్ళిళ్ళకి చేసిన అప్పు వాటి వడ్డీ తీర్చేటప్పటికి తన రిటైర్మెంట్ దగ్గరకొచ్చింది. బాధ్యతల బరువుతో అలిసిపోయిన తనకి వృద్ధాప్యం, అనారోగ్యం తోడయ్యాయి. అతికష్టం మీద జీవనం వెళ్ళదీస్తున్న తనకి ఒకే ఒక ఆశ. ఆ ఆశ ప్రకాశం. వాడికి ఉద్యోగం వస్తే తనకి ఆసరా అవుతాడు అనే ఆశ.

* * *

ప్రకాశానికి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. కృష్ణా జిల్లాలో ఒక పల్లెలో పోస్టింగ్. అతని సంతోషానికి పట్టపగ్గాలు లేవు.

ఇన్నాళ్ళకి నాన్నగారి కష్టాలు తీరాయి అంది సావిత్రి సంతోషంగా.

"మరే" అన్నాడు ప్రకాశం మొదటి నెల జీతం అందుకోగానే ఎలా ఖర్చుపెట్టాలా అని ఆలోచిస్తూ.

"రెండు నెలల్లో సంక్రాంతి పండుగ. మీ అక్కలకి, బావలకి బట్టలు పెట్టాలిరా" అన్నాడు రాజారావు.

"అబ్బబ్బ! నేనింకా ఉద్యోగంలో చేరలేదు. అప్పుడే ఖర్చుల చిట్టా విప్పకండి" అన్నాడు ప్రకాశం విసుగ్గా.

ఆ స్వరంలోని విసుగుదలకి రాజారావు నొచ్చుకున్నాడు.

ప్రకాశం ఉద్యోగంలో చేరాడు. మొదటి నెల జీతం అందుకున్న అతని నుంచి రాజారావుకి అయిదు వందల రూపాయలు మనియార్డర్ వచ్చింది. తన ఖర్చులకి, డబ్బుసరిపోవడం లేదని ఇంతకంటే పంపలేకపోతున్నానని ఉత్తరం వ్రాసాడతడు. తనకి ఉద్యోగం వస్తే సావిత్రికి పట్టుచీర కొనిస్తానన్న అతని వాగ్దానం గాలికెగిరిపోయింది. ఆ రోజు తమ్ముడు అన్న మాటలని సావిత్రి సీరియస్‌గా తీసుకోనూ లేదు.

సంక్రాంతికి కూతుళ్ళకి అల్లుళ్ళకి బట్టలు పెట్టాలనుకుంటున్నానని తండ్రి వ్రాసిన ఉత్తరానికి సమాధానంగా పండుగకి తనకి ఒకరోజే సెలవని అందువలన తను రాలేనని సమాధానం వ్రాసాడు ప్రకాశం. ఆ ఉత్తరంలో డబ్బు ప్రస్తావన ఎక్కడా లేదు.

"వాడు పండక్కి రాలేకపోతేనేం? డబ్బు పంపచ్చుగా?" నిష్ఠూరంగా అన్నాడు రాజారావు.

"పోన్లెండి నాన్నా! అక్కడ వాడేం అవస్థ పడుతున్నాడో" అంది సావిత్రి.

* * *

సంక్రాంతి రోజు.

"తాతా! అమ్మ నాకు, చెల్లికి పట్టులంగాలు కుట్టించింది" అని ఎగురుకుంటూ వచ్చిన పెద్ద మనుమరాలిని ఆ వెనుకనే పరికిణీ కాళ్ళకి అడ్డుపడకుండా ఒక చేత్తో ఎత్తిపట్టుకుని బుల్లి బుల్లి పాదాలతో నడుస్తూ వచ్చిన చిన్న మనుమరాలిని సంబరంగా చూసాడు రాజారావు. ఎరుపు రంగు పట్టు పరికిణీలలో ఇద్దరూ బుట్ట బొమ్మల్లా వున్నారు. ఆ ఇద్దరినీ పరిశీలనగా, చూస్తున్న ఆయన కళ్ళలో చివ్వున నీళ్ళుబికాయి. ఎరుపు రంగు పట్టుచీర.

'ఇది తను సావిత్రికి పెళ్ళికి కొన్న చీర కదూ?'

"నా పరికిణీ బాగుందా తాతా?" పెద్దది అడిగింది.

"నా పరికిణీ బాగుందా?" రెండోది అక్కతో పోటీకి వచ్చింది.

"బంగారు తల్లుల్లా వున్నారు" రుద్ధస్వరంతో అన్నాడు.

"తాతగారిని భోజనానికి పిలవండే అంటే ఇక్కడే కూర్చున్నారా?" అంటూ వచ్చిన సావిత్రిని చూసి ఆయన గుండె చెరువయిపోయింది.

కూతురి వంటి మీద వెలిసిపోయిన చీర, జాకెట్టు తన అసమర్థతని ఎత్తి చూపిస్తున్నాయి.

అయినా ఆమె ముఖంలో ఎంత నిర్మలత్వం? పూచిన పున్నాగలా అంత స్వచ్ఛంగా ఎలా నవ్వగలుగుతోంది?

"అమ్మా! నీ పెళ్ళి చీర చింపించి పిల్లలకి పరికిణీలు కుట్టించావా?" అడగలేక అడిగాడు.

"అవును నాన్నా! పిల్లలు కొత్తబట్టల కోసం పేచీపెడుతుంటే"

"నీకీ సంక్రాంతికైనా చీర కొనలేకపోయా నమ్మా"

"పోన్లెండి నాన్నా? సంక్రాంతి మళ్ళీ రాదా ఏమిటి?"

"ప్రకాశం అంత సంపాదించుకుంటున్నాడు. తోబుట్టువులకి తలొక చీర కొనాలనే ఇంగిత జ్ఞానం లేదూ? వాడికి ఉద్యోగం వస్తే నీకు పట్టుచీర కొని పెడతానని నీకు వాగ్దానం చేసాడు. అసలు మనం గుర్తున్నామా అని; పండక్కి రాడానికి సెలవు దొరకదుట; దారి ఖర్చులు దండగ అనుకున్నాడేమో!" రాజారావు కడుపుమంటని వెళ్ళగక్కాడు.

"చిన్న వెధవ! ఈ సాంప్రదాయాల గురించి పెట్టుపోతల గురించి వాడికేం తెలుసు? మెల్లిగా తెలుసుకుంటాడు" తమ్ముడి స్వార్థ గుణం అర్థమవుతున్నా తండ్రి బాధ పడకూడదని ఓదార్పుగా అంది.

"నాలాంటి దౌర్భాగ్యుడు పిల్లలని..అందునా ఆడపిల్లలని కనకూడదమ్మా!" తల పట్టుకుని ఏడ్చాడు.


"ఛ! ఏం మాటలవి నాన్నా! ఇప్పుడు మాకేం లోటని? రెండు పూటలా కడుపునిండా తింటున్నాం. మీ అల్లుడు, పండక్కి పిల్లలకి, నన్ను, బట్టలు కొనుక్కోమని డబ్బు ఇచ్చారు. నేనే అనవసరపు ఖర్చని ఆ డబ్బుంటే దేనికైనా పనికొస్తుందని దాచాను. మీరు మాకేదో పెట్టలేదని ఎప్పుడూ బాధపడను. మాకు పెట్టలేకపోయానని మీరూ బాధపడకండి. వంట చల్లారిపోతోంది. భోజనం చేద్దురుగాని రండి" తండ్రి చెయ్యి పట్టి లేవదీసింది.

అందమైన అబద్ధంతో తనని, నమ్మించాలని చూస్తున్న కూతురిని ఆర్ద్రంగా చూసాడు రాజారావు.

* * *


"ఒకసారి మన ఊరికి రారా! నిన్ను చూసి చాలా నెలలయింది. పోనీ నీకు సెలవు దొరక్కపోతే నేనే నీ దగ్గర కొచ్చి నాలుగు రోజులు వుంటాను" అని తండ్రి వ్రాసిన ఉత్తరాన్ని, అయిష్టతతో చదివాడు ప్రకాశం. తండ్రి ఇక్కడ కొస్తే తను కొనుక్కున్న ఖరీదైన బట్టలని, ఇంపోర్టెడ్ వాచీని, సెల్‌ఫోన్ని చూస్తాడు. తనకొచ్చే జీతం తన ఖర్చులకే సరిపోవడం లేదని తను చెప్పిన మాట అబద్ధమని తెలిసిపోతుంది. తనే అక్కడకి వెళ్ళడం మంచిది" అనుకుని రెండు రోజుల తరువాత లీవ్ పెట్టి ఊరికి బయలుదేరాడు.

హఠాత్తుగా వచ్చిన కొడుకుని చూసి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు రాజారావు. కొడుకు ధరించిన వెలసిపోయిన చొక్కా, కుట్లూడిపోయిన పాత ప్యాంటుని చూసి నొచ్చుకున్నాడు.



"ఇవేం బట్టలురా అబ్బాయ్? మంచి బట్టలు కుట్టించుకోలేకపోయావా? ఉద్యోగానికి ఈ బట్టలతోనే వెళ్తున్నావా?"

"నేనేదో వేలకి వేలు డబ్బు సంపాదిస్తూ దాచుకుంటున్నానని తెలియని వాళ్ళు అపోహపడతారు. ఆ ఊళ్ళో అన్నీ ఖరీదు. అతి కష్టం మీద రోజులు వెళ్ళదీస్తున్నాను. ఇంక, కొత్త బట్టలు కుట్టించుకోడమొక్కటే తక్కువా" నిరసనగా అన్నాడు.




అతని మాటలలోని శ్లేషకి రాజారావు ముఖం వాడిపోయింది. ఏడాదిన్నర నుంచి ఉద్యోగం చేస్తున్న కొడుకు ఇప్పుడైనా డబ్బు ఇవ్వకపోతాడా, ఆ డబ్బుతో కూతుళ్ళకి చీరలు కొనాలని ఆశపడుతున్న ఆయనకి వాగ్బంధన మయిపోయింది. ప్రకాశం రెండు రోజులు ముళ్ళ మీద వున్నట్టు వుండి మూడవ రోజు ప్రయాణమయ్యాడు.

"సంక్రాంతి పండక్కి రారా అబ్బాయ్! పండగ పూటా నువ్వు ఒంటరిగా అక్కడెందుకు?" అన్నాడు రాజారావు.

"చూద్దాంలెండి. మీ ఆరోగ్యం జాగ్రత్త. మీ ఒంటికి సరిపడనివి తినకండి. రోగమొచ్చి డాక్టరు దగ్గరకి వెళ్తే వేలకి వేలు ఖర్చు" అతని మాటలలో 'మీకు రోగమొస్తే డాక్టర్లకివ్వడానికి నా దగ్గర డబ్బు లేదు సుమా' అనే హెచ్చరిక అన్యాపదేశంగా ధ్వనించింది రాజారావుకి.

ఆడదిక్కులేని సంసారమని, తమ్ముడు ఊరి నుంచి వచ్చాడని ఆ రెండు రోజులూ తండ్రి దగ్గరే వుంది సావిత్రి.

"వెళ్ళొస్తానక్కా!" అన్నాడు ఆమె వైపు చూస్తూ. రంగు వెలిసిపోయి, చిరుగు పట్టి వున్న చీరలో వున్న ఆమెని చూసిన అతని మనసు మారుమూల పొరలలో ఏదో కదిలింది. అంతలోనే తను కొనుక్కోవాలనుకుంటున్న స్కూటర్ గుర్తుకొచ్చి మెత్తబడుతున్న మనసు తిరిగి బండరాయిగా మారింది.

"మంచిదిరా! వెళ్ళగానే నువ్వు క్షేమంగా చేరిన వార్త వ్రాయి" అంది సావిత్రి చిరునవ్వుతో తమ్ముడికి ఎదురొస్తూ.

ప్రకాశానికి తను ఇంటర్వ్యూకి వెళ్తూ అక్కని ఎదురు రమ్మనడం, తనకి ఉద్యోగం వస్తే ఆమెకి పట్టుచీర కొనిపెడతానని చేసిన వాగ్దానము గుర్తుకొచ్చాయి. స్వార్థం అంతరాత్మ పీక నొక్కుతుంటే నడక వేగం పెంచాడు.

'తమ్ముడు జీతం తన ఖర్చులకే సరిపోవడం లేదనడం సావిత్రికి అసహజంగా తోస్తోంది. అతను అబద్ధం చెబుతున్నాడనిపించింది తనకి. తాము అద్దెకి వుంటున్న ఔట్‌హవుస్ అద్దెకిచ్చిన వాళ్ళబ్బాయి ప్రకాశంతో బాటే బ్యాంకు ఉద్యోగంలో చేరాడు. తల్లిని, తండ్రిని బాధ్యతగా చూసుకోవడమే కాదు ఇంట్లోకి ఫ్రిజ్, సోఫాసెట్ లాంటివెన్నో కొన్నాడు.

కాని ప్రకాశం తండ్రికి నెలకో అయిదువందలు పంపడం తప్ప కనీసం ఆయన ఆరోగ్యం బాగుండడం లేదు. డాక్టరుకి చూపిద్దామనైనా అనుకోలేదు. నిజంగానే వాడికి జీతం సరిపోవడం లేదా? లేక ఏమైనా వ్యసనాలు..." ఇకపై ఆలోచించలేకపోయింది.

* * *

ప్రకాశం గదిలోకి వచ్చాడు. తల దించుకుని కూర్చుని వున్న సావిత్రి పక్కన తను తెచ్చిన చీర పెట్టాడు. తరువాత మౌనంగా నేల వైపు చూస్తూ కూర్చున్నాడు. సావిత్రి కళ్ళెత్తి తమ్ముడు తన కోసం తెచ్చిన చీరని చూసింది. 'దుఃఖం పెల్లుబికి రాగా ముఖాన్ని చేతులతో కప్పుకుని బిగ్గరగా రోదించసాగింది' సావిత్రి భర్త యాక్సిడెంటులో చనిపోయి అవేళ్టికి పదో రోజు. ఆచారం ప్రకారం పుట్టింటి ఆడబడుచుకి ప్రకాశం తెచ్చిన తెల్లచీర అది. సావిత్రి తమ్ముడి నుంచి అందుకున్న తొలిచీర.

☆



## అల్ఫాన్సా ఐటమ్ నంబర్స్

ఆమధ్య అల్ఫాన్సా ఐటమ్ సాంగ్ సినిమాకి పెద్ద అట్రాక్షన్‌గా వుండేది. పెళ్లి చేసుకుని బెంగుళూరులో డాన్స్ స్కూలు పెట్టుకుని సినిమాలు మానేసింది. అయితే ఆమె తిరిగి సినిమాల్లోకి రావాలనుకుంటున్నట్టు వినికిడి. ప్రస్తుతం తెలుగులో ముమైత్‌ఖాన్, అభినయశ్రీ లాంటి ఒకరిద్దరు మినహా ఐటమ్ గాళ్స్ ఎక్కువగా లేరు. అందువల్ల అల్ఫాన్సా మళ్లీ తెలుగులో డాన్సులు చేయాలని భావిస్తోందిట. 'క్షేమంగావెళ్లి లాభంగా రండి'లో 'లవ్వుకి ఏజు బారుందా రంగనాయకి' అనే ఐటమ్ నంబర్ చేసి జనాన్ని ఉర్రూతలూగించిన అల్ఫాన్సా- ఇప్పుడు నిజంగానే యేజ్ బారయ్యాక చేయబోయే ఐటమ్ నంబర్లు ఎంతగా ఆకట్టుకుంటాయో చూద్దాం!